క్లుప్తంగా

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళి



రుషి కాలనీలో నివాళులు అర్పిస్తున్న పద్మశాలీ ట్రస్ట్ ప్రతినిధులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భవన రుషి కాలనీలో శ్రీ మార్కండేయ పద్మశాలీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. సంఘం ప్రతినిధులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ట్రస్ట్ ప్రతినిధులు కొంపల్లి జగదీష్, సామల యాదయ్య, దొంత రాజు, యంజాల మహేష్ రాజ్, కోట శ్యాం, గంజీ రాజు, ఇప్పలపల్లి చిరంజీవి, బిట్రు రాధాకృష్ణ, సిద్ధిరాల రాజ్ కుమార్, వాడిగాచర్ల మల్లేష్, ఏర్వ మహేష్, దనపతి భిక్షపతి, శ్రీనివాస్, బండారి యాదయ్య, సిరిసిల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు శ్రీవారి బ్రహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీమాన్ కాటూరి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో బ్రహోత్సవాలు జరనున్నట్లు తెలిపారు. మొదటి రోజు అభిషేకంతో మొదలై అంకురార్పణ, సాముహిక విష్ణుసహస్రనామ పారాయణం తదితరులు పూజలు నిర్వహిస్తారు. రెండోరోజు ఆకుపచ్చ వర్ణంతో అలివేలు మంగ సహిత స్వామివారిని అలంకరించి బాలభోగం, పుణ్యావాచం, నిత్యహోమం, మూడో రోజు బుధవారం స్వామి కల్యాణ మహోత్సవం, బలిహరణం, గురు, శుక్రవారాల్లో నిత్య హోమం, బాలభోగం తదితర పూజా కార్యక్రమాల నిర్వహించనున్నారు. రోజూ మధ్యాహ్నం అన్నప్రసాదం, రాత్రి అల్పాహార వితరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

'మత్తుకు బానిస కావద్దు'

మణికొండ: యువత మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని భారతీయ జనతా పార్టీ మణికొండ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కె.శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు అలకాపూర్ టౌన్‌షిప్ జాన్సీ లక్ష్మీ భాయి పార్క్‌లో నషాముక్త్ యువ సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత జీవితంలో రాణించాలనే ఉన్నత విద్యతో పాటు యోగాను నేర్చుకోవాలన్నారు. అప్పుడు మనల్ని మనం నియంత్రణ చేసుకుని చెడుమార్గాలకు దూరంగా జీవించే అవకాశం ఉంటుందన్నారు. తల్లితండ్రులు సైతం వారి పిల్లలను యోగా తరగతులకు పంపి మానసిక నియంత్రణ సాదించే వారిలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మెడిటేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి

మణికొండ: లక్ష్మీనగర్ కాలనీలో చేపట్టిన రోడ్డు పనులను పూర్తి స్థాయి నాణ్యతతో చేయాలని మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కాలనీలో కొనసాగుతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ పనులను సంవత్సరాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా చేపట్టాలన్నారు. గతంలో డ్రైనేజీ పనులు చేపట్టిన తరువాత చేసిన ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతతో చేయక గోతులు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారన్నారు. ఉన్నత ప్రమాణాలు పాటించి పనులు చేయాలని సూచించారు. బీజేపీ నాయకులు సి.బీరప్ప, కాలనీ నేతలు మల్లికార్జున్, డి.కృష్ణ, పి. శ్రీనివాస్, మాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముష్కి చెరువును సంరక్షించుకోవాలి



మణికొండ: జీవవైవిధ్యాన్ని సంరక్షించే చెరువులను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనకు నీటి కొరత, కాలుష్య సమస్య ఉండదని ముష్కి చెరువు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గౌతంరెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సరిహద్దులోని ముష్కి చెరువు చుట్టు పక్కల పడిన చెత్తాచెదారాన్ని కమిటీ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముష్కి చెరువును అన్ని రకాలకు పరిరక్షించుకుంటామని, ప్రభుత్వ శాఖలు, దత్తత తీసుకున్న సంస్థలను సమన్వయం చేసుకుని నందన వనంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. సభ్యులు లింగరాజు, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, అయ్యప్ప రెడ్డి, కోటేశ్వర్‌రావు, గోపాల్‌రావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



విద్యుద్ దీపాల అంకరణలో అమ్మవారి ఆలయం,



శరన్నవరాత్రులకు ముస్తాబైన అమ్మవారు



దుర్గాదేవి మండపానికి చేరుకున్న అమ్మవారి విగ్రహం

- నేటి నుంచి దసరా ఉత్సవాలు
- నేత్రపర్వంగా ముస్తాబైన దేవాలయాలు
- వాడవాడలా అమ్మవారి మండపాల ఏర్పాటు
- పటిష్ట ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

రాజేంద్రనగర్, శాస్త్రిపురం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని ప్రజలు సర్వం సిద్ధం చేశారు. వాడవాడలా వెలసిన అమ్మవారి ఆలయాలను నిర్వాహకులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దేవాలయాలకు రంగులు వేసి రంగురంగల విద్యుత్ దీపాలతో నేత్రపర్వంగా అలంకరిస్తున్నారు.

రాజేంద్రనగర్, గ్రీన్ సిటీ, బుద్వేల్, ఎర్రబోడ, శివరాంపల్లి ప్రాంతాల్లోని అమ్మవారి దేవాలయాల్లో పెద్ద ఎత్తున నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారు. సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శరన్నవరాత్రి పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నిత్యం అమ్మవారిని వివిధ రూపాలలో నేత్రపర్వంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి అలంకరణకు అనుగుణంగా నైవేద్యాన్ని సైతం సమర్పించనున్నారు. దేవాలయాల్లో నిర్వహించే పూజ కార్యక్రమాల విషయమై ఇప్పటికే బ్యానర్లు, కరపత్రాలతో దేవాలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టారు.



పూజలకు ముస్తాబైనా ఆలయం

ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు 11 రోజులు పాటు నిర్వాహకులు వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మొదటి రోజు అమ్మవారు స్వర్ణ కవచలాంకృత దుర్గాదేవిగా, రెండవరోజు బాలాతిపుర సుందరిగా, మూడవ రోజు గాయత్రీదేవిగా, నాల్గవ రోజు అన్నపూర్ణదేవిగా, ఐదవ రోజు గౌరీదేవిగా, ఆరవ రోజు లలితాదేవిగా, ఏడవ రోజు మహాలక్ష్మి దేవిగా, ఎనిమిదవ రోజు సరస్వతీ దేవిగా, తొమ్మిదో రోజు దుర్గాదేవిగా, పదవ రోజు, మహిషాసురమర్దినిగా, చివరిరోజు రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

క్రీడలు అలవాటుగా మార్చుకోవాలి



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

శంషాబాద్: క్రీడలు పిల్లల దగ్గరి నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని రాజేంద్రనగర ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు.ఆదివారం పట్టణంలో ఎస్ఎస్ స్కేటింగ్ మైదానంలో మహబూబ్‌నగర్ జిల్లా రోలర్ స్కేటింగ్ చాంఫియన్ షిప్ 2025 పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.... చిన్న వయసుల్లో క్రీడాభిరుచిని పెంచడం ఎంతో మంచిదన్నారు. క్వాడ్, ఇన్‌లైన్ విధానాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన వారిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, సీనియర్ నాయకులు దూడల వెంకటేష్‌గౌడ్, జి.వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడను ఆదర్శంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న కాలనీ నేతలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు నిధులను మంజూరు చేసి అభివృద్ధి పరుస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు హరీశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శివ సాయినగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన పనులను ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించి వెంటనే కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి జరగవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేషన్స్ వేసి వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేషన్ అభివృద్ధిలో భాగంగా సంవత్సరంలోనే ఇప్పటికే వంద కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. బండ్లగూడ కార్పొరేషన్‌ను రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనే గొప్ప కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. కాలనీ నేతలు బహుబలి వినయ్, రాజేష్, భరత్, హేమంత్, రాధిక, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు





శాస్త్రిపురం: సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని పలు బస్తీలలో వెలగని విద్యుత్ దీపాలకు సంబంధిత అధికారులు మరమ్మతు పనులను చేపట్టారు. బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు వెలగడం లేదంటూ ఆయా ప్రాంతాల ప్రజలు ప్రజావాణి కార్యక్రమం, ఫోన్‌ల ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందించిన వీధి దీపాల విభాగం అధికారులు ఆదివారం పాడైన వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

బండ్లగూడ: ప్రజా సమస్యలను తెలుసుకోని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం కార్పొరేషన్ పరిధిలోని రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ వాసులు తమ కాలనీలలో వివిధ సమస్యలపై ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని వాటిని అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రపంచ సంక్షేమాన్ని కాంక్షించే దేశం భారత్

- ఆర్‌ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ
- ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

బండ్లగూడ: ప్రపంచ సంక్షేమాన్ని కాంక్షించే దేశం భారత దేశం అని, ప్రపంచానికి ధర్మాన్ని అందించే దేశమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామం ప్రాంతంలోని మైదానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చరిత్ర తన కళ్లు తెరవకపోయినా అప్పటి నుంచే భారత్‌లోని హిందూ ధర్మం ప్రపంచానికి సత్యం, ధర్మం, ఆధ్యాత్మిక మార్గాన్ని చూపిస్తూనే ఉందన్నారు. ఇది పురాతన కాలం నుంచి కొనసాగుతుందన్నారు. ప్రపంచానికి ఎప్పుడు ఏ రకమైన అవసరం ఏర్పడినా భారత్ మాత్రం సిద్ధంగా ఉందన్నారు. స్వాతంత్రానంతరం పరిస్థితులు, అప్పటి చరిత్ర చూస్తే చరిత్ర ఆధారంగా కూడా పరిశీలిస్తే భారత్ వైభవం వెలిగిపోతుందని ఎవరూ అనుకోలేదని, కానీ ప్రపంచంలో భారత్ ఇప్పుడు ఉన్నత శిఖరాల్లో ఉందని హర్షం వ్యక్తం చేశారు. విశ్రాంత రాయబారి (రిటైర్డ్ ఐఎఫ్ఎస్) అధికారి సంఘం సేవకులు టి.నాగేంద్రప్రసాద్, 200 మంది స్వయం సేవకులు, కుటుంబాలతో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రచారక్ లింగం శ్రీధర్ జీ

అన్నదానం.. పుణ్యకార్యం



కార్యక్రమంలో పాల్గొన్న అత్తాపూర్ మహారానా ప్రతాప్ సేవా సమితి సభ్యులు

అత్తాపూర్: అత్తాపూర్ మహారాణా ప్రతాప్ సేవా సమితి ఆధ్వర్యంలో పిత్రు పక్ష అమావాస్య సందర్భంగా ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పితృదేవతల శాంతి కోసం అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు. సేవా సమితి అధ్యక్షుడు ఠాకూర్ విజయ్‌దినేష్‌సింగ్, కోశాధ్యక్షులు ఠాకూర్ మనోజ్‌దేవిసింగ్, రిటైర్డ్ జడ్జి ఠాకూర్ గోపాల్‌సింగ్, ఠాకూర్ జీవన్‌సింగ్, ఠాకూర్ కుమార్ గౌరవ్ సింగ్, ఠాకూర్ శివ నందన్‌సింగ్, ఠాకూర్ రాజ్‌కిషోర్‌సింగ్, ఠాకూర్ రంజిత్ దేవిసింగ్, ఠాకూర్ రఘునందన్‌సింగ్, ఠాకూర్ చరణ్‌సింగ్, భవాని సుజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్ నగర్, అత్తాపూర్ డివిజన్లకు చెందిన ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను లిఖితపూర్వకంగా ప్రజావాణి కార్యక్రమానికి హాజరై ఫిర్యాదు చేయాలన్నారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణిలో అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వట్టినాగులపల్లిలో...



మణికొండలో బతుకమ్మలతో మహిళలు



గౌరమ్మతో బతుకమ్మ



అలకాపూర్ టౌన్‌షిప్ బతుకమ్మలను సిద్ధం చేస్తున్న మహిళలు



మణికొండలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



అలకాపూర్ టౌన్‌షిప్‌లో...



అలకాపూర్‌లో...



మణికొండలో...

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు
- ఆడి పాడి సందడి చేసిన మహిళలు

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా దసరా నవరాత్రుల సందర్భంగా మహిళలు సామూహికంగా జరుపుకొనే బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మణికొండ, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, కోకాపేట, పుప్పాలగూడ, గోలిదొడ్డి గ్రామాలతో పాటు అలకాపూర్ టౌన్ షిప్ ఎంజీ పార్కులో మహిళలు రంగురంగుల పూలతో రోజంగా బతుకమ్మలను సిద్ధం చేసుకుని సాయంత్రం వాటిపై గౌరమ్మలను ఉంచి ఇళ్ల ముందు పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో పాటలతో ఆడి పాడారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మగా పూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభించి చివరి రోజు దసరా పండగ రోజు పూల బతుకమ్మలతో సద్దుల బతుకమ్మతో ఉత్సవాలను ముగిస్తారు. మరో 8 రోజుల పాటు అపార్ట్‌మెంట్‌లు, కాలనీలలో మహిళలంతా చేరి బతుకమ్మ, దాండియాలతో సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్, కాంగ్రెస్ అధ్యక్షుడు జింతేందర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



మణికొండ అలకాపూర్ టౌన్‌షిప్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు



మణికొండ వెంకటేశ్వర కాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



రాజేంద్రనగర్ బతుకమ్మ ఆడుతున్న మహిళలు